సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



మట్టి గణపతే.. మహా గణపతి

ఈ నెల 27 నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాల్లో పూజలకు మట్టిగణపతినే వాడాలని పలువురు విద్యావంతులు చెబుతున్నారు.

-10లో



గంజాయి సరఫరా చేయలేదని హత్య

పశ్చిమ బెంగాల్ వాసి హత్యకేసు మిస్టరీ వీడింది. గంజాయి సరఫరా చేస్తానని చేయలేదని వ్యాపారులు హత్య చేసినట్లు విచారణలో తేలింది.

-10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.410	రూ.530
రెండోరకం	రూ.270	రూ.400

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 110 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	607	611
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 84.860 కిలోలు



న్యూస్‌రీల్

ఇంటర్ విద్యార్థులకు క్విజ్ పోటీలు

రాయచోటి టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదుతున్న విద్యార్థులకు ఎయిడ్స్/ హెచ్ఐవీపై క్విజ్ పోటలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు రాయచోటి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈనెల 22వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఇందులో విజేతలైన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. ఏడీఎం, హెచ్‌వో రమేష్ బాబు, డీఐఈవో రవి ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం చదుతున్న విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని సూచించారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



బ్రహ్మకమలాలలో శారదమ్మ

రామసముద్రం: రామసముద్రం మండలం కేసీ పల్లి పంచాయతీ గుంతయంబాడి గ్రామంలో కృష్ణయ్యగారి శారదమ్మ, రామారావు ఇంటి పెరట్లో గురువారం రాత్రి బ్రహ్మకమలాలు విరబూశాయి. వారి ఇంటి పెరట్లో ఉన్న బ్రహ్మ కమలం చెట్టు సుమారు 14 పుష్పాలు పూశాయి. వీటిని చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏడాదిలో రెండు సార్లు పుష్పాలు పూస్తాయని కుటుంబీకులు తెలిపారు.

యూరియా సరఫరాలో జాగ్రత్తలు తప్పనిసరి



యూరియాను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

నందలూరు: యూరియా సరఫరాలో జాగ్రత్తలు తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి జి.శివనారాయణ మండల వ్యవసాయ అధికారులకు సూచించారు. గురువారం నందలూరు మండలంలో ఆయన పర్యటించారు. రైతు సేవ కేంద్రాన్ని, యూరియా సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియాను పంటలకు మాత్రమే వాడాలని రైతులకు తెలియజేశారు.ప్రతి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను అడిగి పురోగతిని తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో ప్రతి రైతును ఈ పంట పరిధిలోకి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మండలల వ్యవసాయ అధికారి మల్లిఖార్జున, వ్యవసాయ శాఖ సిబ్బంది భరత్‌కుమార్, శిల్ప, విజయ తదితరులు పాల్గొన్నారు.

కాపుల కంట్లో పసుపు కారం!

- ఇన్‌చార్జి పదవి కేటాయింపుపై బలిజల్లో తీవ్ర అసంతృప్తి
- బాబు నిర్ణయంపై భగ్గుమంటున్న కాపులు



రాజంపేట: రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి విషయంలో కాపుల(బలిజలు)కంట్లో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కారంకొట్టారనే వాదన వినిపిస్తోంది. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో కూడా ఇన్‌చార్జి పదవి విషయంలో అధిష్టానం తమకు న్యాయం చేస్తుందన్న కలలు కల్లలుగా మారిపోయాయి. చంద్రబాబు ఇన్‌చార్జి విషయంలో తీసుకున్న నిర్ణయంపై బలిజ సామాజికవర్గం భగ్గుమంటోంది. ఇప్పటికే పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడుగా ఉన్న చమర్తి జగన్‌మోహన్‌రాజుకు ఇన్‌చార్జి పదవిని కట్టబెట్టడంతో అసంతృప్తి రగులుతోంది. ఆందోళనలు చేసినా సీఎం చంద్రబాబు పట్టించుకోలేదన్న అంశంపై ఇప్పుడు నియోజవర్గ కాపు సామాజికవర్గంలో ఆందోళన కలిగిస్తోంది.

సైలెంట్‌గా పక్కచూపులు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న బలిజ సామాజికవర్గనేతలు ఇన్‌చార్జి పదవి చమర్తి జగన్‌మోహన్‌రాజుకు ఇవ్వడంతో సైలెంట్ అయ్యారు. కొందరు జనసేన, మరికొందరు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గుచూపుతున్నారు. మరికొందరు పార్టీలోనే ఉంటూ ఇన్‌చార్జి చమర్తి పెత్తనాన్ని ఎప్పటికప్పుడు అడ్డుకోవాలని యోచిస్తున్నారు. బలిజనేతలు టీడీపీ అధిష్టానానికి అల్టిమేటం కూడా ఇచ్చారు. వీటన్నింటిని సీఎం చంద్రబాబు , ఆయన తనయుడు లోకేష్ లెక్కచేయలేదనే ఆరోపణలు ఉన్నాయి.

మనీ పాలిట్రిక్స్‌తోనే..

మని పాలిట్రిక్స్‌తో బలిజ సామాజికవర్గనేతలకు ఇన్‌చార్జి కేటాయింపు విషయంలో టీడీపీ అధిష్టానం హ్యాండ్ ఇచ్చిందని విశ్వసనీయంగా తెలిసింది. ఇటీవల ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు టీడీపీ రూ.5 కోట్లకుపైగా వ్యయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సహకరించిన నేతకే టీడీపీ పగ్గాలు అప్పగించారన్న చర్చ మొదలైంది. ఆది నుంచి చమర్తి జగమోహన్‌రాజును బలిజ సామాజికవర్గం వ్యతిరేకిస్తూ వస్తున్న సంగతి విదితమే. రాజంపేట విషయంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చంద్రబాబు కౌగిలిలో బలిజనేతలు బలి

చంద్రబాబు కౌగిలిలో రాజంపేటకు చెందిన అనేక మంది బలిజనేతలు బలయ్యారని రాజకీయచరిత్ర సాక్షిగా బహిర్గతమైన సంగతి తెలిసిందే.

- మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్యను 2012లో ఉపఎన్నికల్లో ఓడిపోతారని తెలిసినప్పటికి చంద్రబాబు బరిలోకి దించారు. 21వేల ఓట్లు వచ్చి ఓటమిపాలయ్యారు. ఆర్థికంగా చితికిపోయారు. 2014లో టికెట్ ఇస్తారని అధిష్టానం చుట్టూ తిరిగారు. టికెట్ ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన తనయులను చంద్రబాబు పట్టించుకోలేదు.
- 2019లో వైఎస్సార్‌సీపీ గాలిలో రాజంపేటలో అభ్యర్థికి దిక్కులేక, రైల్వేకోడూరునియోజకవర్గానికి చెందిన బలిజ సామాజికవర్గనేత బత్యాల చెంగ్రాయుడును ఎన్నికల బరిలోకి దింపారు. 59,994 ఓట్లు వచ్చాయి. ఓటమిపాలయ్యారు. అధికారంలోకి వచ్చాక బత్యాల గురించి అధిష్టానం పట్టించుకోలేదు. 2024 ఎన్నికల్లో బత్యాలకు టీడీపీ టిక్కెట్ ఇవ్వకుండా మొండిచేయి చూపింది.
- టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షునిగా, యువనేత గంటా నరహరిని రాజంపేట పచ్చ రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. గంటా తన దైన శైలిలో టీడీపీ బలోపేతానికి కృషిచేశారు. ఎంపీ సీటు ఇస్తామన్నారు. తర్వాత ఎమ్మెల్యే టికెట్ అన్నారు. ఈ నేపథ్యంలో రాజంపేటను బేస్ చేసుకొని టీడీపీ తరపున విస్తృతంగా కార్యక్రమాలను నిర్వహించారు. కోట్లాది రూపాయిలు వ్యయం చేశారు. అన్న క్యాంటీన్ తరహాలో పేదలకు ఉచితభోజనాలు నిత్యం పెడుతూ వచ్చారు. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. బత్యాల,గంటాకు మధ్య వర్గవిభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి.టికెట్ విషయంలో గంటా నరహరిపట్ల టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చిన్నచూపు చూశారు. బలిజలకు న్యాయం జరగదనే భావన తో గత సార్వత్రిక ఎన్నికల ముందే గంటా నరహరి తిరుగుబాటు చేశారు. వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు.
- 2024 ఎన్నికల్లో చంద్రబాబు బలిజసామాజికవర్గానికి చెందిన సుగవాసి సుబ్రమణ్యంను బరిలోకి దింపారు. 85, 593 ఓట్లు వచ్చాయి. ఓటమిపాలయ్యారు. ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు సుగవాసికి వెన్నుపోటు పొడిచారని అప్పట్లో రాజకీయంగా దుమారం రేగింది. ఓటమి తర్వాత అధికారపార్టీ ఇన్‌చార్జిగా సుగవాసిని ప్రకటించక అన్యాయం చేసే విధంగా టీడీపీ అధిష్టానం వ్యవహరించింది. దీంతో సుగవాసి సుబ్రమణ్యం వైఎస్సార్‌సీపీలో చేరారు.
- కడపలో ఉంటూ, ఒంటిమిట్ట మండలం నరసన్నగారిపల్లెకు చెందిన హరిప్రసాద్ కూడా ఇన్‌చార్జి పదవి విషయంలో పోటీ పడ్డారు. స్వయంగా చంద్రబాబును కలిసి విన్నవించారు. తనకు నియోజకవర్గంలోని బలిజల మద్దతు ఉందని చెప్పుకొచ్చారు. ఈయనను కూడా చంద్రబాబు పక్కనపెట్టేశారు.

టీడీపీలోని బలిజనేతలు ఒక్కటవుతారా?

రాజంపేట ఇన్‌చార్జి పదవి విషయంలో బలిజ సామాజికవర్గానికి చెందిన బత్యాలకు అవకాశం కల్పించాలని ఆత్మీయసమావేశాలు, వినూత్న నిరసనలు చేశారు. వీటిని అధిష్టానం పట్టించుకోకపోవడం గమనార్హం.తిరిగి ఇన్‌చార్జి పదవిని దక్కించుకొనే విషయంలో వీరు ఒక్కటవుతారా? అధిష్టానం నిర్ణ యాన్ని వ్యతిరేకిస్తారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇన్‌చార్జి విషయంలో న్యాయం జరగకపోతే బలిజనేతలు పక్కచూపులు చూసేందుకు సిద్ధమవుతారని నిఘా వర్గాలు అంచనావేస్తున్నాయి.

చమర్తి జగన్‌మోహనరాజుపై బాబు మొగ్గు



టీడీపీ ఇన్‌చార్జి కుర్చీని రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న చమర్తి జగన్‌మోహనరాజు దక్కించుకున్నారు. బలిజ, రెడ్డి సామాజికవర్గ నేతలు పోటీపడినా, వారిని లూప్‌లైన్‌లో పెట్టి,తాను కుర్చీని అధిష్టించడంలో సఫలీకృతులయ్యారు. దీంతో చమర్తి వర్గీయులు ఆనందోత్సవాలు జరుపుకుంటున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో టికెట్ విషయంపై అధిష్టానం హామీ ఇవ్వలేదన్న సమాచారం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్ర, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి

మదనపల్లె: జిల్లాలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపి వాటిని సంరక్షించాల్సిన కీలక బాధ్యత తహసీల్దార్లదే అని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. గురువారం స్థానిక ఆదిత్య కళాశాలలో డివిజన్‌లోని తహసీల్దార్లు, వీఆర్‌ఓలకు రెవెన్యూ పాలనలో పారదర్శకత, సమయపాలన, ప్రజా సమస్యల పరిష్కారంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్ర, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణీతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి కలెక్టర్ మాట్లాడతూ రీ సర్వేలో అనవసరంగా జాయింట్ ఎలిమెంట్స్ పెడితే రైతులు ప్రభుత్వ పథకాలు పొందడానికి ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వ భూములు, కాలిబాట, పాదదారి, బండిబాట, నీటి వనరులు, చెరువులు ఆక్రమణలకు గురైతే స్పష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కొందరు అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా రెవెన్యూశాఖకు చెడ్డపేరు రాకుండా, నిజాయితీగా పని చేయాలని కోరారు. పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన వినతులు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులు, భూ వివాదాలు, రీసర్వే, సుమోటో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్, ఏడీఎస్‌బీ పోర్టల్, రస్తా వివాదాల్లో రెవెన్యూ సిబ్బంది కీలక పాత్ర పోషించాలన్నారు. సమస్యలపై వచ్చే ప్రజలకు పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని సూచించారు. నిర్లక్ష్యంగా సేవలు అందిచడం ద్వారా రెవెన్యూశాఖకు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు జావాబుదారిగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపే అధికారులపై కఠినచర్యలు తప్పవని, ఉద్యోగ భద్రతను కోల్పోతారని హెచ్చరించారు.

కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ డేటాను అప్‌లోడ్ చేయాలి

రాయచోటి: ప్రభుత్వం నిర్దేశించిన కీలక ప్రదర్శన సూచిక(కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్)లకు సంబంధించిన డేటా సేకరణ, అప్‌లోడ్ పనులను వేగవంతం చేసి ఈనెల 25వ తేదిలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ), ఎంఐ ట్యాంకులు అండ్ గ్రౌండ్ వాటర్ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన శాఖల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన సూచికలకు సంబంధించి డేటాను పారదర్శకంగా సేకరించి అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయి అభివృద్ధి, పరిపాలన సమర్థత, ప్రజా సేవల నాణ్యతకు సంబంధించి శాఖలవారీగా నిర్దేశించిన ఇండికేటర్లపై అంచనాలు వేసి వాటి ఆధారంగా డేటా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సీపీఓ సి పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కుట్రలో భాగంగానే దివ్యాంగ పింఛన్ల తొలగింపు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి



వికలాంగునితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి (ఫైల్)

రాయచోటి: దివ్యాంగ పెన్షన్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. గురువారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పెన్షన్లు తొలగింపుపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామన్న ప్రభుత్వం ప్రస్తుతం ఉన్నవాటిని తొలగించే పనిలో పడిందన్నారు. తొలి విడతగా దివ్యాంగ, వృద్ధాప్య పింఛన్లపై కన్నేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి రాగానే కొత్త పంథాకు తెరదీసి రీ వెరిఫికేషన్, రీ అసెస్‌మెంట్ పేరిట వికలాంగులంతా మరోసారి వైద్యుల వద్దకు వెళ్లి సదరం సర్టిఫికెట్ చేయించుకోవాలని షరతు పెట్టిందన్నారు. వికలత్వం ఎంత ఉందో వైద్యులతో ధ్రువీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్‌ను తీసుకురావాలని, కొత్త నిబంధలను ప్రవేశపెట్టిందన్నారు. దీంతో గత పది, పదిహేనుళ్లుగా పింఛన్ తీసుకుంటున్న వికలాంగులు సైతం మళ్లీ సదరం సర్టిపికెట్లు కోసం దరఖాస్తు చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. దివ్యాంగులను మానవతా దృక్పతంతో ఆదుకోవాల్సింది పోయి వారి జీవితాలతో ఆటలాడుకుంటోందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఆరు నెలలకొకసారి కొత్త పెన్షన్లను మంజూరు చేసేవారన్నారు. అదే తరహాలో కూటమి ప్రభుత్వం చేయాలని కోరారు.

- జిల్లాలో 3774 మందికి పింఛన్లను తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. ఒక్క రాయచోటి నియోజకవర్గంలో 915 మందికి నోటీసులు ఇచ్చారన్నారు.సెప్టెంబర్ నుంచి వీరికి పెన్షన్లు వచ్చే అవకాశం ఉండదేమోనని శ్రీకాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల శోకం రాష్ట్రానికి మంచిది కాదన్నారు. సదరం ధ్రువీకరణ పత్రాలుకోసం నడవలేనివారిని తరచూ ఆసుపత్రుల చుట్టూ తిప్పడం సమంజసం కాదన్నారు.
- గత జగన్ ప్రభుత్వంలో పింఛన్‌దారుడు మృతి చెందితే మరుసటి నెల నుంచే ఆయన భార్యకు (స్పౌజ్) పెన్షన్ మంజూరు అయ్యేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెన్షన్ సైట్‌ను క్లోజ్ చేయడంతో ఈ తరహా పెన్షన్లు మంజూరు ఆగిపోయిందన్నారు. 2024 నవంబర్ తర్వాత మృతి చెందిన వారికి మాత్రమే స్పౌజ్ పింఛన్లను ఈ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వీటినే కొత్త పెన్షన్లు అన్నట్లుగా కూటమి నాయకులు హడావిడి చేశారన్నారు. సంక్షేమ పథకాలు జగన్ ప్రభుత్వమే సక్రమంగా ఇచ్చిందని తెలిపారు.
- నిరుద్యోగం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు, దివ్యాంగులకు పెన్షన్ వస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వీటిని తొలగించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే పింఛన్లను పునరుద్ధరించాలని శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఎస్సీలకు డ్రైవింగ్‌లో శిక్షణ

రాయచోటి టౌన్: ఎస్సీలకు భారీ మోటర్ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం కార్యనిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై, 20 నుంచి 40 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలన్నారు. లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి, హెచ్ఎంవీ కోసం ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలని తెలిపారు. హెవీ మోటార్ వెహికల్ ఎల్ఎల్ఆర్ కోసం రూ.210, లైసెన్స్ కోసం రూ.1060 అభ్యర్థులే చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం అర్హులైన వారిని పదిమందిని ఎంపిక చేసి అందులో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు నమూనాలను జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం, డి బ్లాక్, నూతన కలెక్టరేట్, కడప అనే చిరునామాలో పొందవచ్చని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: ఏపీ పాఠశాల విద్య సంచాలకులు అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన యాజమాన్యాలకు స్పౌస్, మ్యూచువల్ ప్రాతిపదికన లీప్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులై, ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పేర్కొన్నారు.

సార్వత్రిక విద్య..ఉన్నతికి సోపానం

- ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశాలు
- దరఖాస్తుకు గడువుపెంపు

మదనపల్లె సిటీ: మధ్యలో చదువు మానేసిన, ఉత్తీర్ణులు కాలేపోయినా వారి విద్యాసక్తిని నెరవేర్చేందుకు సార్వత్రిక విద్య విధానం (ఓపెన్ స్కూల్) ఉపయోగకరంగా ఉంటోంది. ఈ విధానంలో ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడిన వారు ఎంతో మంది ఉన్నారు. 14 ఏళ్ల నుంచి బడి మధ్య మానేసిన వారు సార్వత్రిక పాఠశాలలో చేరి 10వ తరగతి చదువుకునేందుకు అవకాశం ఉంది. అంతేగాక 15 ఏళ్లు నిండి పదో తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్‌లో చేరి చదువుకునే వెసులుబాటుంది. ఇది వరకు ఇంటర్మీడియట్ చదివి అనుత్తీర్ణులై, మధ్యలో మానేసిన వారు కూడా ఈ విధానంలో పూర్తి చేయవచ్చు. మహిళలు, వివిధ వృత్తులు, వ్యాపార రంగంలో ఉన్న వారికి, ఉద్యోగులకు, వివిధ సంఘాల సభ్యులు,సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి చదువుకునేందుకు ఓపెన్ స్కూల్ చక్కని మార్గం. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులయ్యాక డిగ్రీ, పీజీ తదితర కోర్సులతో పాటు పోటీ పరీక్షల్లో తమ ప్రతిభ చాటుకునే వీలుంది.

- పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కలిస్తోంది. ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంది. వీరు ఎలాంటి ఉద్యోగానికైనా అర్హులే. చదువుపై ఆసక్తి ఉన్న పలువురు ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పూర్తి చేసి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అభ్యాసకులకు విద్యను మరింత చేరువ చేసేలా ప్రభుత్వం ఓపెన్ స్కూల్ తరగతులు నిర్వహిస్తోంది.



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓపెన్‌స్కూల్ కేంద్రం

ప్రవేశాలు ఇలా:

జులై నెల నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 15 వతేదీ వరకు అడ్మిషన్ పొందవచ్చు.

కనీసం 24 కాంట్రాక్టు తరగతులు

ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, నెలలో రెండో శనివారం అధ్యయన కేంద్రాల్లో 30 కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 24 కాంటాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే అనుమతిస్తారు. సార్వత్రిక పాఠశాలలో చేరే వారికి స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి:

అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసేవారు మాత్రం 10 పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకునే అవకాశం ఉంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక సబ్జెక్టును రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందకపోతే తిరిగిర కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్లకు గుర్తింపు ఉంది

సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు అందించే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్‌సెట్ వంటి పరీక్షలతో పాటు ఇంటర్ అర్హతతో పొందే అన్ని ఉద్యోగాలకు అర్హులే.


టెన్త్‌కు 35...ఇంటర్‌కు 31 కేంద్రాలు

జిల్లాలో టెన్త్‌కు 35, ఇంటర్‌కు 31 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. పదో తరగతిలో 100 మందికి, ఇంటర్‌లో నాన్ సైన్స్‌లో 40, సైన్స్‌లో100 మందికి అవకాశం ఉన్నాయి. అడ్మిషన్ పొందిన వెంటనే స్టడీ మెటీరియల్ అందిస్తారు. ప్రతి ఆదివారం, సెలవు రోజుల్లో ఆయా అధ్యయన కేంద్రాల్లో కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతితో పాటు ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూపులైన హెచ్ఈసీ, సీఈసీ, సైన్స్ గ్రూపులైన ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత చదువులకు , ఉద్యోగాలకు, పదోన్నతులకు ఉపయోగపడుతున్నాయి. అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా లేదా జనన ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్, ఫోటో, సంతకంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అర్హతలు..

ఎస్ఎస్‌సి కోర్సులో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు వయసు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి ఉండదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దర ఖాస్తుతో పాటు టీసీ,రికార్డు షీటు, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, ఎస్ఎస్‌సి టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థుల కులధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది.

నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి



చదువుకోవాలనుకునే వారికి ఓపెన్‌స్కూల్ సువర్ణావకాశం. ఆసక్తి ఉన్నవారు, చిరు ఉద్యోగాలు చేస్తూ పదోన్నతులు పొందాలనుకునే వారు సార్వత్రిక విద్య వరంలాంటిది. ఉపాధి, ఉన్నత చదువులకు ఉపకరిస్తుంది. ఈ సర్టిఫికెట్లు ప్రభుత్వం గుర్తింపు ఉంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. అభ్యర్థులు వివరాలకు 8121852786 ను సంప్రదించాలి.

–శ్రీనివాసరాజు,
ఓపన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్.

క్లుప్తంగా

సామూహిక సెలవులో పంచాయతీ కార్యదర్శులు



ఎంపీడీఓ సురేష్ బాబుకు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రాయచోటి టౌన్ : రాయచోటి మండల పరిధిలోని పలు గ్రామ సచివాలయాలలో విధులు నిర్వర్తించే పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవు ప్రకటిస్తూ ఎంపీడీఓ సురేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాయచోటి పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామ సచివాలయ కార్యదర్శి శ్రీనివాసులు, గొర్లమొదివీడు కార్యదర్శి రమాదేవి, శిబ్యాల కార్యదర్శి వెంకటరమణ, పెమ్మాడపల్లె కార్యదర్శి సాజియా, దిగువ అబ్బవరం కార్యదరి శివలక్ష్మి, కాటిమాయకుంట కార్యదర్శి మల్లికార్జునలను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. దీనిని నిరసిస్తూ సామూహికంగా సెలవుపై వెళుతున్నట్లు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తే క్రిమినల్ కేసులు



కంచె ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు : అక్రమంగా మట్టి తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. ఈనెల 20 వ తేదీన సాక్షి దినపత్రికలో 'పెద్ద చెరువును చెరబట్టారు' అనే శీర్షికతో వెలువడిన కథనంపై స్పందించిన తహసీల్దార్ గురువారం పెద్దచెరువులో మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువులోకి ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు వెళ్లకుండా మార్గాలను మూసివేస్తూ ట్రెంచ్ (గొయ్యి) తీయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గుట్టలు, వాగులు, వంకలు, చెరువుల్లో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే క్రిమినల్ కేసులు పెట్టి జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు.

అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన



అటవీ శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రాజంపేట : అటవీ సిబ్బందిపై శ్రీశైలం ఎమ్మెల్యే దాడిని నిరసిస్తూ ఏపీ ఫారెస్టు జూనియర్ ఆఫీసర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాజంపేటలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కేవీ సుబ్బయ్య, అధ్యక్షుడు రవిశంకర్(రాజంపేట యూనిట్) మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఫారెస్టు మినిస్టీరియల్ అసోసియేషన్, ఏపీఎన్‌జీఓ అసోసియేషన్, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మట్టి గణపతే.. మహా గణపతి

ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు వద్దు.. మట్టి గణపతే ముద్దు

రాజంపేట టౌన్ : పండుగల్లోకెల్లా వినాయక చవితి పండుగ సంబరమైంది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ప్రజలు కలిసి మెలసి చవితి ఉత్సవాలను ఆనందంగా జరుపుకుంటారు. ఈనెల 27వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అన్ని ప్రాంతాల్లో ఉత్సవాల ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. వినాయక చవితిని జరుపుకోవాలంటే ప్రధానంగా కావాల్సింది గణపయ్య విగ్రహం. అయితే చాలా మంది మార్కెట్‌లో సులువుగా దొరికే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పీఓపీ)తో తయారు చేసిన రంగురంగుల బొజ్జ గణపయ్యలను తెచ్చుకొని పూజిస్తారు. అయితే రసాయనాలతో తయారు చేసిన ఈ విగ్రహాల కంటే మట్టి విగ్రహాలను పూజిస్తే పర్యావరణానికి ఎంతో శ్రేయస్కరమని విద్యావంతులు చెబుతున్నారు. అలాగే సహజ సిద్ధంగా ప్రకృతిలో దొరికే ముడిసరుకుతో చేసే వినాయక ప్రతిమలనే పూజించాలని పురాణాలు కూడా చెబుతున్నాయి.

మట్టితో మనిషికి విడదీయరాని బంధం

మట్టికి, మనిషికి విడదీయరాని బంధం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే మానవ మనుగడ ప్రకృతితో ముడిపడి వుంది. ప్రకృతి ఆరాధనతో మొదలైన పూజలు ఇప్పుడు విగ్రహ ఆరాధన వరకు వచ్చాయి. సాధారణంగా మిగతా దేవతా మూర్తుల విగ్రహాలను కళాకారులు రాయితో మలుచుతారు. అయితే వినాయక చవితి ఉత్సవాల అనంతరం స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేయాల్సి వున్నందున కళాకారులు సులువుగా విగ్రహాలను తయారు చేసేందుకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో గణపయ్య విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇటీవల కాలంలో విగ్రహాల ఏర్పాటు సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. జిల్లాలో వేల సంఖ్యల్లో పెద్ద విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు సంభవించే ప్రమాదముందని విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

కొంతలో కొంత మార్పు..

గతంలో కంటే ప్రస్తుతం కొంత మార్పు వచ్చిందనే చెప్పాలి. వినాయక చవితి సందర్భంగా ఇళ్లల్లో కొలువుదీర్చే గణపయ్యలను ముఖ్యంగా విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు మట్టితో చేసిన విగ్రహాలనే కొలువుదీర్చి పూజలు చేస్తున్నారు. అందువల్ల జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కళాకారులు మట్టితో చిన్న విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వినాయక చవితి పండుగకు అతి తక్కువ సమయం ఉండటంతో వ్యాపారులు మట్టితో తయారు చేసిన విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. మట్టితో తయారు చేసే విగ్రహాలకు మంచి డిమాండ్ కూడా ఉంది. అయితే వీధుల్లో, గ్రామాల్లో ఏర్పాటు చేసే భారీ గణపయ్యలను కూడా మట్టితో చేసే విగ్రహాలనే ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



సిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలు

మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలు ఇవీ

- సహజ సిద్ధంగా లభించే బంకమట్టితో చేసే విగ్రహాలు త్వరగా నీటిలో కరిగిపోతాయి.
- మట్టి విగ్రహాలను నిమజ్జనం చేసినా నీటి వనరులకు ఎలాంటి నష్టం ఉండదు.
- కాలుష్యానికి ఎలాంటి హాని చేయదు. అందువల్ల స్వచ్ఛమైన గాలి, వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు.

రసాయన విగ్రహాల వల్ల కలిగే అనర్థాలు

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు త్వరగా నీటిలో కరగవు. ఈ విగ్రహాల్లో జిప్సం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, కార్బన్ వంటి అవశేషాలు ఉంటాయి.
- ఇలాంటి విగ్రహాలు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగితే జీర్ణకోశ వ్యాధులు సంక్రమిస్తాయి.
- నీటిలో ఉండే చేపలు వంటి జీవరాసులు కూడా రోగాల బారిన పడతాయి.
- రసాయనాలు కలిసిన నీటి మూలంగా శరీరంలో నరాలపై ప్రభావం చూపి కేన్సర్ వ్యాధికి దారితీస్తుంది. అలాగే చర్మ వ్యాధులు సోకుతాయి.
- రసాయనిక రంగులు కలిసిన నీరు పంట పొలాలకు చేరితే దిగుబడులు తగ్గిపోతాయి. అలాగే ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది.

శాస్త్రీయంగా కూడా శ్రేష్టమైనది



మట్టి విగ్రహాలను పూజించడం శాస్త్రీయంగా కూడా శ్రేష్టమైనది. అంతేకాక మట్టి విగ్రహాలను తయారు చేసే వారు చాలా నియమ, నిష్టలతో విగ్రహాలను తయారు చేస్తారు. నిష్టతో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తే చాలా మంచిది. మేము చిన్నప్పటి నుంచి మట్టి విగ్రహాన్నే పూజిస్తున్నాము.

జనార్దనస్వామి, ప్రముఖ పురోహితులు, రాజంపేట

మా వంతు చైతన్యం కల్పిస్తున్నాం



మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది. మా వంతు బాధ్యతగా మా పాఠశాలలోని ద్యార్థులకు మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేసి, మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలనే పూజించాలని విద్యార్థులకు తెలియజేస్తున్నాం.

లేబాకు గోపాలకృష్ణ, హెచ్‌ఎం.పెనగలూరు మండలం

భావితరాల మనుగడకే ముప్పు



ఇటీవల కాలంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల ఏర్పాటు ఎక్కువైంది. ఈ విగ్రహాల వల్ల భావితరాల మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదముంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను నిమజ్జనం చేసే నీళ్లను వాడితే మనిషికి చర్మవ్యాధులు సంభవిస్తాయి. ఫలితంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందువల్ల ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలనే పూజించాలి.

జి.చక్రధర్‌రాజు, నేషనల్ గ్రీన్‌కోర్ రీజినల్ కో-ఆర్డినేటర్

రోడ్డు ప్రమాదంలో నైట్ వాచ్‌మన్ మృతి

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి గ్రామం తూర్పుపల్లె దళితవాడకు చెందిన కొండిగారి రామచంద్రయ్య(57) రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వండాడి గ్రామ సచివాలయంలో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్న రామచంద్రయ్య అంగడికి వెళ్తుండగా ద్విచక్రవాహనం రామచంద్రయ్యను ఢీకొంది. వెంటనే క్షతగాత్రుడిని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రామచంద్రయ్య మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఫార్మసీ రంగానిదే ప్రధాన భూమిక

ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి



రుక్సానాకు ప్రశంసాపత్రం అందజేస్తున్న అన్నమాచార్య యూనివర్సిటీ చాన్సలర్

రాజంపేట : నేటి సమాజంలో ఫార్మసీ రంగానిదే ప్రధాన భూమిక అని అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి అన్నారు. గురువారం జాతీయ స్థాయి సదస్సులో మొదటి బహుమతి సాధించిన రుక్సానా బేగం, అధ్యాపకురాలు సుష్మితను ఆయన అభినందించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఫార్మసీ రంగంలో రాణిస్తే దేశ, విదేశాలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత మాట్లాడారు. కార్యక్రమంలో అన్నమాచార్య ఫార్మసీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి

జేసీ ఆదర్శ రాజేంద్రన్



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నీతి అయోగ్ సంస్థ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల వలన విశేష ఫలితాలు సాధించామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్‌లో జరిగిన సంపూర్ణ అభియాన్ సమ్మాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జేసీ పాల్గొన్నారు. నీతి అయోగ్ సూచించిన ఆరు పరిమితుల్లో లక్కిరెడ్డిపల్లి, కోడూరు, కురబలకోట మండలాల్లో అధికారులు సమర్థవంతంగా పనిచేసి అభివృద్ధి సాధించారన్నారు. కురబలకోట మండలం బంగారు పతకాన్ని, కోడూరు మండలం వెండి పతకాన్ని, లక్కిరెడ్డిపల్లి మండలం కాంస్య పతకాన్ని అందుకున్నట్లు జేసీ వెల్లడించారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణంలో చేతి వృత్తుల మహిళలు తయారు చేసిన వస్తు ప్రదర్శనల స్టాల్‌ను జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ పెద్దయ్య, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ఐసీడీఎస్ పీడీ హైమావతి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో రెండు బార్లకు నోటిఫికేషన్

రాజంపేట : రాజంపేట ఎక్సైజ్‌శాఖ పరిధిలో రెండు బార్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో రాయచోటి ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన మాట్లాడుతూ ఆసక్తిగల వారు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ మధుసూదన్ 7989216381, ఇన్‌స్పెక్టర్ మల్లిక 9440902595 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

బస్సు పాసుల జారీ కౌంటర్ నిర్వాహకుడి తొలగింపు



మాట్లాడుతున్న డీఎం రమణయ్య

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డిపోలో బస్‌పాస్ జారీ కౌంటర్ నిర్వాహకుడు కిషోర్‌ను విధుల నుంచి తొలగించామని రాజంపేట డిపో మేనేజర్ రమణయ్య తెలిపారు. గురువారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. గత కొంతకాలంగా విద్యార్థుల బస్సు పాసుల జారీ విషయంలో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. హార్టికల్చర్ విద్యార్థి అభిషేక్ పట్ల దురుసుగా ప్రవర్తించిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. రెండు, మూడు రోజులుగా చార్జీలు చెల్లించి కళాశాలకు వెళుతున్న విద్యార్థికి అయిన చార్జీలు తాను చెల్లించి, బస్సు పాసు రెన్యువల్ చేసి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ మాధవి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకుడు భాస్కర్ తదితరులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డీఎంను కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి



మృతి చెందిన బాలగంగాధర్

ఒంటిమిట్ట : రాజంపేట చావిడి వీధికి చెందిన సోమిశెట్టి బాలగంగాధర్ బుధవారం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాలగంగాధర్ గత కొంతకాలంగా అప్పులు, అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఉండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఒంటిమిట్ట మండల పరిధిలోని నడింపల్లి వద్ద ఉన్న రెడ్డి అన్నదాన కేంద్రం సమీపంలో విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు బాలగంగాధర్ వద్ద ఉన్న సెల్‌ఫోన్ తీసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోటారు వైర్ల చోరీ

మైదుకూరు : మైదుకూరు శివార్లలో వనిపెంట రోడ్డులో ఉన్న పొలాల్లో వ్యవసాయ మోటారు వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలోని పొలాల వద్దకు సంబంధిత రైతులు గురువారం ఉదయం వెళ్లగా మోటారుకు అమర్చిన స్టార్టర్ వైర్లను కత్తిరించి ఉండటం గమనించారు. దుండగుల పనిగా భావించి రైతులు లబోదిబోమంటున్నారు.

భూ వ్యవహారంలో హోంగార్డు జోక్యం

- చేనేత కార్మికులకు బెదిరింపులు
- డీఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు



డీఎస్పీ మహేంద్రను కలిసి హోంగార్డు రాజశేఖర్‌పై ఫిర్యాదు చేస్తున్న చేనేత కార్మికులు

మదనపల్లె రూరల్ : భూ వ్యవహారాల్లో హోంగార్డు రాజశేఖర్ జోక్యం చేసుకుని, చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు కలిగిన చేనేత కార్మికులను బెదిరిస్తున్నాడని బాధితులు డీఎస్పీ మహేంద్రకు ఫిర్యాదు చేశారు. గురువారం నీరుగట్టువారిపల్లెకు చెందిన చేనేత కార్మికులు డీఎస్పీ మహేంద్రను కలిసి తమకు జరిగిన అన్యాయంపై విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కోళ్లబైలు పంచాయతీ సర్వే నంబర్.605-2బీలో 20 ఏళ్ల క్రితం సుమారు 50 మంది చేనేత కార్మికులు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్నామన్నారు. అప్పట్లో సరైన మౌలిక వసతులు లేని కారణంగా ఇళ్ల నిర్మాణం చేయలేకపోయామన్నారు. ప్రస్తుతం రోడ్లు, ఇతర వసతులు సమకూరడంతో గ్రామ సచివాలయం నుంచి ప్లాన్ అనుమతులు పొంది ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తే కొందరు వ్యక్తులు కావాలనే అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారన్నారు. పదిరోజుల క్రితం భూములను దున్నేసి వెళ్లారన్నారు. దీనిపై తాలూకా పోలీస్ స్టేషన్‌లో సీఐకు ఫిర్యాదు చేశామన్నారు. రెండు రోజుల క్రితం భవన నిర్మాణ సామగ్రి భద్రపరుచుకునేందుకు చిన్నపాటి షెడ్‌రూమ్‌లు ఏర్పాటు చేసుకుంటుంటే, రాత్రి 10 గంటల సమయంలో మంజునాథ్, హోంగార్డు రాజశేఖర్‌లు జేసీబీతో వాటిని ధ్వంసం చేసి నష్టం కలిగించారన్నారు. మూడేళ్లుగా కొందరు వ్యక్తులు కావాలనే భూముల విషయంలో ఇబ్బందులు పెడుతుండటంతో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామన్నారు. ప్రస్తుతం చట్టపరమైన అన్ని అనుమతులతో ఇళ్ల నిర్మాణాలకు వెళుతుంటే, హోంగార్డు రాజశేఖర్ సహాయంతో దౌర్జన్యం చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. చేనేత కార్మికుల మైన తాము కష్టార్జితంతో కొనుగోలు చేసిన భూముల్లో ఇతరుల జోక్యం లేకుండా, ఇళ్లు నిర్మించుకునేందుకు పోలీసు శాఖ సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

రాజంపేట రూరల్ : అంగన్‌వాడీలను కూటమి ప్రభుత్వం అడుగడుగునా మోసగిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ విమర్శించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద బ్లాక్ డే సందర్భంగా గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగనవాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలన్నారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.విజయమ్మ, సెక్టార్ లీడర్లు ఎం.శివజ్యోత్స్న, లక్ష్మిదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సరఫరా చేయలేదని హత్య

- ఎట్టకేలకు వీడిన పశ్చిమ బెంగాల్ వాసి హత్యకేసు మిస్టరీ
- ఇద్దరి అరెస్టు, మరో ముగ్గురి కోసం గాలింపు



పశ్చిమ బెంగాల్ వాసి హత్య కేసులో నిందితుల అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

మదనపల్లె రూరల్ : సీటీఎం రైల్వే ట్రాక్ పక్కన అనుమానాస్పదంగా పడవేసిన పశ్చిమ బెంగాల్ వాసి హత్యకేసు మిస్టరీ వీడింది. గంజాయి సరఫరా చేస్తానని డబ్బులు తీసుకుని, సరుకు పంపిణీ చేయకపోవడంతో గంజాయి వ్యాపారుల మధ్య జరిగిన వివాదంతోనే పశ్చిమబెంగాల్ వాసిని దారుణంగా హత్యచేసి, ప్రమాదంగా చిత్రీకరించేందుకు రైలు పట్టాలపై పడేసినట్లు రైల్వే పోలీసులు విచారణలో నిగ్గు తేల్చారు. గురువారం కదిరి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో హత్యకేసు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. హత్యలో మరో ఇద్దరి ప్రమేయం ఉందని, వారికోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ధర్మవరం ప్రభుత్వ రైల్వే పోలీసు సీఐ అశోక్‌కుమార్ కథనం మేరకు.. పశ్చిమబెంగాల్ ముషీరాబాద్ జిల్లా ఇమాంనగర్‌కు చెందిన ఎస్.కే.మైమూల్ కుమారుడు షేక్ ఖాదీర్(30) ఐదేళ్ల క్రితం మదనపల్లె సమీపంలోని అంగళ్లుకు జీవనోపాధి నిమిత్తం వచ్చాడు. స్థానికంగా బేల్దారి పనులతో పాటు జేసీబీ కూలిపనులకు వెళ్లేవాడు. వీటితో పాటు ఒరిస్సా నుంచి ఎక్కువ మొత్తంలో గంజాయి తీసుకువచ్చి కిలో రూ.24వేల చొప్పున మదనపల్లెలో విక్రయించేవాడు. ఈ క్రమంలో మద్యం, గంజాయి తాగే అలవాటు ఉన్న మదనపల్లె మండలం బసినికొండలో నివాసం ఉండే పఠాన్ ఆసిఫ్‌ఖాన్(40)తో ఖాదీర్‌కు పరిచయం ఏర్పడింది. ఆసిఫ్ తల్లి గంజాయి విక్రేతగా అరెస్ట్ అయి గతంలో జైలుకు వెళ్లి వచ్చింది. ఆసిఫ్ తల్లి తెచ్చిన గంజాయిని తాగడంతో పాటు విక్రయించేవాడు. ఖాదిర్ వద్ద గంజాయిని కొనుగోలుచేసి స్నేహితులైన మౌలా, సుల్తాన్‌తో పాటు మరికొంతమందికి అమ్మేవాడు. నెలరోజుల క్రితం రెండు కిలోల గంజాయి కావాలని ఆసిఫ్, పశ్చిమబెంగాల్‌వాసి ఖాదిర్‌కు రూ.50వేల రూపాయలు ఇచ్చాడు. అయితే ఖాదిర్, ఆసిఫ్‌కు గంజాయి కానీ డబ్బులు కానీ ఇవ్వలేదు. ఈ విషయం ఆసిఫ్ తన మిత్రులైన మౌలా, సుల్తాన్‌లకు చెప్పడంతో వారు ముగ్గురు, మరో ఇద్దరిని వెంటబెట్టుకుని మొత్తం ఐదుగురు ఈనెల 15వతేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో అంగళ్లులో నివాసం ఉంటున్న ఖాదిర్ రూమ్‌కు చేరుకున్నారు. అతడిని బలవంతంగా సుల్తాన్‌కు చెందిన టయోటో ఇథియోస్ కారులో ఎక్కించుకుని కర్నాటకలోని రాయల్పాడు సమీపంలోని నీలగిరి తోటలోకి తీసుకువెళ్లారు. సాయంత్రం వరకు అతడిని అక్కడే ఉంచి, గంజాయి ఎక్కడ ఉంచావో చెప్పాల్సిందిగా నీలగిరి కర్రలతో కొట్టారు. ఖాదిర్ ప్రస్తుతం తన వద్ద గంజాయి లేదని తెప్పించి ఇస్తానని చెప్పడంతో అక్కడ నుంచి తిరిగి కారులో ఎక్కించుకుని రాత్రి 7 గంటల సమయంలో వన్‌టౌన్ పరిధిలోని దేవళంవీధిలోని ఇంటికి తీసుకువచ్చి, మరోసారి కర్రలతో తీవ్రంగా కొట్టారు. దెబ్బలు తాళలేక ఖాదిర్ చనిపోయాడు. ఈ విషయం ఆసిఫ్, సుల్తాన్‌కు చెప్పగా, రైలు పట్టాలపై ఖాదిర్ శవాన్ని పడేస్తే ఏదో రైలు కింద పడి చనిపోయాడని భావిస్తారని చెప్పడంతో ఆటోలో మౌలాతో పాటు ఖాదిర్ శవాన్ని తీసుకుని 16వతేదీ తెల్లవారుజాము 4.30 గంటల సమయంలో మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్ దగ్గరలోని రైల్వే బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. ఖాదిర్ శవాన్ని రైలు పట్టాలపై పడేసేందుకు ఆసిఫ్, మౌలాలు తీసుకువెళుతుండగా, అంతలో ఒక వాహనం అటువైపుగా రావడంతో లైట్ల వెలుగు వారిపై పడటంతో తప్పించుకునే క్రమంలో బ్రిడ్జి మెట్లపై మృతదేహాన్ని పడేసి వచ్చిన ఆటోలో పారిపోయారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో కీ మాన్ రైలు ట్రాక్ కింది భాగంలో శవం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కదిరి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో క్రైమ్‌నెం.14/2025 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. శవం పడి ఉన్న తీరు, ఒంటిపై ఉన్న గాయాలను గమనించి అనుమానాస్పద మృతిగా భావించి దర్యాప్తు చేస్తుండగా, పశ్చిమబెంగాల్‌కు చెందిన ఖాదిర్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా హత్యకు గురైనట్లు నిర్ధారించుకుని, కేసును హత్యకేసుగా మార్పుచేశారు. విచారణలో చివరిసారిగా ఖాదిర్ ఆసిఫ్‌తో కలిసి వెళ్లినట్లు గుర్తించి అతడి కోసం రైల్వే పోలీసులు గాలిస్తుండగా విషయం తెలుసుకున్న ఆసిఫ్, మౌలాలు నేరుగా కదిరి రైల్వే పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. వీరి నుంచి ఆటో స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన నిందితుల్లో షేక్ మౌలా మదనపల్లె వన్‌టౌన్ పరిధిలో రౌడీషీటర్, 2016లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ హత్యకేసులో మరో నిందితుడైన రౌడీషీటర్, 2016 మదనపల్లె వన్‌టౌన్ పరిధిలోని హత్యకేసులో నిందితుడిగా ఉన్న సుల్తాన్‌తో పాటు మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు రైల్వే సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులు ఆసిఫ్, మౌలాలను గుంతకల్లు రైల్వే కోర్టులో రిమాండ్ నిమిత్తం హాజరుపరిచినట్లు తెలిపారు. మదనపల్లె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవళం వీధిలో హత్య జరిగినట్లు విచారణలో తేలడంతో కేసును మదనపల్లె వన్‌టౌన్‌కు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనపరిచిన సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ బాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్‌బాషా, సిబ్బందిని గుంతకల్లు రైల్వే పోలీస్ ఎస్పీ రాహుల్‌మీనా, సబ్ డివిజన్ డీఎస్ఆర్పీ శ్రీనివాసాచారి అభినందించారు.

20 పోలింగ్ కేంద్రాల పెంపునకు ప్రతిపాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి బి. అమరనాథరెడ్డి

పీలేరురూరల్ : పీలేరు అసెంబ్లీ 163 నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 20 పోలింగ్ కేంద్రాలు పెంచేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి బి. అమరనాథరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం ఓటర్లలో పురుషులు 1,15,105 మంది, మహిళలు 1,19,954, ఇతరులు 21 మంది ఉన్నట్లు తెలిపారు. మొత్తం 2,35,080 ఓటర్లు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో 1200 ఓటర్ల కంటే మించిన పోలింగ్ కేంద్రాలు 20 ఉన్నాయని, వాటిని పునర్విభజన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివకుమార్, డీటీ ప్రసాద్, ఏఎస్ఓ రెడ్డెప్పనాయుడు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆటో ఢీ కొని యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : ఆటో ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. బి.కొత్తకోట మండలం గట్టు గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు జయంత్‌కుమార్ (27) వ్యవసాయకూలి పనుల నిమిత్తం సీటీఎంకు వచ్చాడు. పనులు ముగించుకుని సాయంత్రం కూలీలతో పాటు ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా సీటీఎం అంగళ్లు సమీపంలోని పెట్రోల్ బంకు సమీపంలో మరో ఆటో వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో కుడి కాలు, చేయి విరిగాయి. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగి బలవన్మరణం

సుండుపల్లె: చేతికొచ్చిన కుమారుడు బలవన్మరణం చేసుకుని విగతజీవిగా మారడంతో ఆ కుటుంబంలో ఆక్రందనలు నింపాయి. వివరాల్లోకి వెళ్తే రాయచోటికి చెందిన ఇమ్రాన్ బాషా తిమ్మసముద్రం గ్రామ సచివాలయంలో ఉద్యాన సహాయకుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండేళ్ల క్రితం సోదరి కూడా మరణించడంతో తండ్రి మతిస్థిమితం కోల్పోయాడు. ఇప్పుడు కుమారుడు శవమై కనిపించడంతో ఆ తండ్రి బాధ వర్ణణాతీతంగా మారింది. ఆ తండ్రి ఆవేదన స్థానికులను కలిచివేసింది. మంచి ఉద్యోగం.. ప్రశాంతంగా జీవించాల్సిన యువకుడు ఇలా బలవన్మరణానికి పాల్పడటం కుటుంబంలో విషాదాన్ని మిగిల్చింది. వృత్తి పట్ల నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన వ్యక్తిని కోల్పోవడం జీర్ణించుకోలేకున్నామని సహోద్యోగులు తమ బాధను వ్యక్తం చేసి, సంతాపాన్ని తెలియజేశారు. కాగా ఇమ్రాన్ బాషా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సివుంది.